సాక్షి
ఆదిలాబాద్
ఆదివారం । 16 । ఏప్రిల్ । 2023






**అడ్డొస్తే .. దాడులే**
జిల్లాలో కలప స్మగ్లర్ల ఆగడాలు మితిమీరుతున్నాయి. అడ్డొచ్చిన వారిపై దాడులకు దిగుతూ ఎంతకైనా తెగిస్తున్నారు. 8లో▸



**'భారత దర్శన్'తో సంస్కృతి ఏకీకరణ**
భారతీయ సంస్కృతి ఏకీకరణకు భారత్ దర్శన్ యాత్ర కీలకం కానుందని బీజేపీ జాతీయ నేత మురళీధర్‌రావు అన్నారు. ఈ యాత్ర జిల్లా కేంద్రానికి చేరుకుంది. 8లో▸

గరిష్టం/కనిష్టం
41.0/27.0

**వాతావరణం**
వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత పెరగనుంది. వడగాలులు వీస్తాయి.




## న్యూస్‌రీల్

### విధులు విస్మరిస్తే కఠిన చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

సాక్షి ఎఫెక్ట్..

నేరడిగొండ: పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది సక్రమంగా పనిచేయాలని, విధులు విస్మరిస్తే కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన అన్నారు. నేరడిగొండ పీహెచ్‌సీని శనివారం ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. 'పీహెచ్‌సీలో ఇష్టారాజ్యం' శీర్షికన 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన కథనం నేపథ్యంలో వివరాలపై ఆరాతీశారు. నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సద్దాం విధి నిర్వహణలో అలసత్వంపై గతంలోనూ మెమో జారీ చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో వైద్య సిబ్బంది హరికుమార్ గౌడ్, రాం నరేష్ తదితరులు ఉన్నారు.

### రిమ్స్ వైద్యులపై చర్యలు తీసుకోవాలి



బాధిత మహిళ కుటుంబీకులతో మాట్లాడుతున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: పురిటి నొప్పులతో రిమ్స్ ఆసుపత్రికి వచ్చిన ఆదివాసీ మహిళకు పురుడు పోయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పూసం సచిన్ రాష్ట్ర నాయకులు లంకా రాఘవులు డిమాండ్ చేశారు. ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత మహిళను శనివారం వారు పరామర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సుందరగిరికి చెందిన ఆదివాసీ మహిళ పురుటి నొప్పులతో వస్తే రిమ్స్ వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించి బయటకు పంపించడం దుర్మార్గమన్నారు. సమయానికి ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లకపోతే తల్లీబిడ్డ ప్రాణాలు దక్కేవి కావన్నారు. కూలినాలి చేసుకుని బతికే ఆదివాసీలు ప్రైవేట్‌లో వైద్యం కోసం బంగారం అమ్మాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. బాధ్యులైన వైద్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత మహిళకు ప్రభుత్వం పరిహారం అందించి గర్భిణులకు అందించే పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. వారి వెంట జిల్లా నాయకులు బైరి సోమేశ్, రాజు తదితరులు ఉన్నారు.

### ఆ రైతులంతా రేపు కలెక్టరేట్‌కు రావాలి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ఫసల్ బీమా కేసులు 2018, 2019లో పరిష్కారం కానటువంటి రైతులంతా ఈ నెల 17న కలెక్టరేట్‌కు రావాలని డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. విషయాన్ని సంబంధిత రైతులు గమనించాలని ఆయన కోరారు.

### మెరిట్ జాబితా విడుదల

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో భర్తీ చేయనున్న ఐదు ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ పోస్టులు, ఒక హోమియోపతి వైద్యుల భర్తీకి సంబంధించి మెరిట్‌లిస్ట్ విడుదల చేసినట్లు డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాను కార్యాలయ నోటీసుబోర్డుతో పాటు http://adilabad. telangana. gov.inలో అందుబాటులో ఉంచినట్లుగా పేర్కొన్నారు.

### 19న జరగాల్సిన పరీక్ష 18వ తేదీకి మార్పు

ఆదిలాబాద్‌టౌన్: ఈ నెల 19న నిర్వహించాల్సిన డీసీఈబీ సమ్మేటివ్–2 పరీక్ష 18వ తేదీకి మార్పు చేసినట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. ఇది వరకు 18 తేదీన ఆప్షనల్ సెలవు ఉండగా దాన్ని 19వ తేదీకి మార్చినందున పరీక్షను ముందు రోజు నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల హెచ్‌ఎంలు గమనించాలని సూచించారు.



తలమడుగు మండలం సుంకిడి గ్రామ శివారులో మార్కెట్ యార్డ్ ఏర్పాటు కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలం

# కొత్త ఏఎంసీ.. సుంకిడి

- ఏర్పాటుపై త్వరలోనే ఉత్తర్వులు
- గ్రామ శివారులో ఐదెకరాల స్థలం కేటాయింపు
- పరిధిలోకి మూడు మండలాలు చేరే అవకాశం

సాక్షి,ఆదిలాబాద్: సుంకిడి.. తలమడుగు మండలంలోని ఈ గ్రామంలో ప్రభుత్వం నూతనంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి త్వరలోనే ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. తాజాగా గ్రామ శివారులో ఐదెకరాల ప్రభుత్వ స్థలం సైతం కేటాయించింది. అయితే దీని పరిధిలోకి ఏయే మండలాలు రానున్నాయనేది ఉత్తర్వుల ద్వారా స్పష్టం కానుంది.

**ఆ మూడు మండలాలు చేరిస్తే..**
ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ప్రస్తుతం ఆదిలాబాద్ అర్బన్, ఆదిలాబాద్ రూరల్, మావల, తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాలు ఉన్నాయి. ప్రస్తుతం తలమడుగు మండలంలోని సుంకిడిలో మార్కెట్ కమిటీ ఏర్పాటు చేస్తే దీని పరిధిలోకి తాంసి, తలమడుగు, భీంపూర్ తీసుకునే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. అదే జరిగితే ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ పరిధి తగ్గడంతో పాటు పంట కొనుగోళ్లు, ఆదాయం అన్నింటిపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఆదిలాబాద్ మార్కెట్ పరిధిలోకి వచ్చే ఆరు మండలాల పరిధిలో 1 లక్ష 25 వేల 650 ఎకరాల్లో పత్తి, సోయాతో పాటు ఇతర పంటలు సాగవుతున్నాయి. వాటి దిగుబడులను ఆదిలాబాద్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. అయితే సుంకిడిని కొత్త ఏఎంసీగా ఏర్పాటు చేసి తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాలను దాని పరిధిలోకి చేరిస్తే ఆదిలాబాద్ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం పడనుంది. ఆ మూడు మండలాల పరిధిలో 85 వేల ఎకరాల్లో పంటలు ఏటా సాగవుతాయి. ఇక ఆదిలాబాద్ పరిధిలో మిగిలే ఆదిలాబాద్‌రూరల్, మావల, ఆదిలాబాద్‌అర్బన్‌లు నామమాత్రంగా 40,650 ఎకరాల సాగు మాత్రమే మిగలనుంది. తద్వారా దిగుబడులను రైతులు ఈ మార్కెట్‌కు తెచ్చి విక్రయించే పరిస్థితి తగ్గనుంది.

**కోల్పోనున్న వైభవం..**
తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాల రైతులు పంటల దిగుబడులను ఆదిలాబాద్ వరకు తీసుకొచ్చి విక్రయించడం దూరభారంతో కూడుకున్నది. సుంకిడిలో ఏఎంసీ ఏర్పాటు అయితే వారికి అన్ని విధాలా తోడ్పాటు అందే అవకాశం ఉంటుంది. అయితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అత్యధిక పంటల కొనుగోళ్లతో ఇన్నాళ్లపాటు కొనసాగిన వైభవం ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కోల్పోనుంది.

**పాలకవర్గంపై అప్పుడే ఆశలు..**
వ్యవసాయ మార్కెట్ కమి టీ ఏర్పాటు కాక ముందే దీని పాలకవర్గంపై పలువురు రాజకీయ నాయకులు ఆశలు పెంచుకున్నారనే ప్రచారం సాగుతుంది. దీని రిజర్వేషన్ ఎలా ఉంటుందనేది కూడా ఆసక్తికరమే. ఒక వేళ జనరల్ రిజర్వేషన్ అయితే పోటీ తీవ్రంగా ఉండే అవకాశాలూ లేకపోలేదు. బోథ్ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే సుంకిడి మార్కెట్ కమిటీ పాలకవర్గం ఏర్పాటులో ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుదే కీలకం కానుంది. కాగా ఆయన ప్రధాన అనుచరుడైన ఓ కీలకనేత ఈ పదవిపై ఇప్పటికే ఆశలు పెట్టుకుని ముందుగానే అందుకు కార్యాచరణ రూపొందించుకుని ప్రణాళికబద్ధంగా కదులుతున్నట్లు పార్టీలో చర్చసాగుతుంది.

**ఉత్తర్వులు రావాల్సి ఉంది..**



సుంకిడి మార్కెట్ కమిటీ ఏర్పాటుకు సంబంధించి ఇది వరకే ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం తాజాగా సుంకిడిలో ఐదెకరాల భూమి కేటాయించింది. ఏర్పాటు ఉత్తర్వులు త్వరలో వచ్చే అవకాశం ఉంది.
– శ్రీనివాస్, డీఎంవో, ఆదిలాబాద్

# వీల్‌చైర్స్.. అంతంతే!



పేషెంట్ కేర్ టేకర్స్ అందుబాటులో లేకపోవడంతో రోగిని తీసుకెళ్తున్న బంధువులు



స్ట్రెచర్ కోసం గొడవ పడుతున్న రోగుల బంధువులు

- స్ట్రెచర్స్ ఉన్నా కనిపించని పేషెంట్ కేర్ టేకర్స్
- రోగులను బంధువులే తీసుకెళ్లాల్సిన దుస్థితి
- 'రిమ్స్'లో ఇదీ పరిస్థితి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రి పేదలకు వరప్రదాయనిగా ఉంది. నిత్యం రోగులతో కిటకిటలాడుతుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధితో పాటు మహారాష్ట్రలోని కిన్వాట్, పాతస్, బోరి, పాంఢ్రకవడా తదితర ప్రాంతాల నుంచి అత్యవసర పరిస్థితుల్లో రోగులు వస్తుంటారు. ఇలాంటి వారిని ఆయా వార్డులకు తీసుకెళ్లేందుకు వీల్ చైర్లు అవసరం ఉండగా ఒకటి, రెండు మాత్రమే దర్శనమిస్తున్నాయి. స్ట్రెచర్స్ అందుబాటులో ఉన్నా చాలా వరకు శిథిలావస్థకు చేరాయి. వాటిపైన ఉండాల్సిన బెడ్స్ అసలే కన్పించడం లేదు. వీటిని తీసుకెళ్లేందుకు వార్డ్‌బాయ్‌లు, పేషెంట్ కేర్ టేకర్స్ ఉన్నా రోగుల బంధువులే వారిని తీసుకెళ్లాల్సిన దుస్థితి. ముఖ్యంగా గర్భిణులు, రోడ్డు ప్రమాద క్షతగాత్రులు, ఆత్మహత్యకు యత్నించిన వారు, హార్ట్ ఎటాక్ వచ్చిన పేషెంట్లను తీసుకెళ్లేందుకు వారు తీవ్ర ఇబ్బంది ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రతీవార్డుకు వీల్‌చైర్, స్ట్రెచర్ అందుబాటులో ఉండాల్సినప్పటికీ అవి రిమ్స్‌లో కన్పించడం లేదు. ఈ విషయమై రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్‌ను వివరణ కోరగా 48 వీల్ చైర్లు అందుబాటులో ఉంచామని, మరో 15 స్టోర్ రూంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే ఆస్పత్రిలో 30 స్ట్రెచర్లు ఉన్నట్లుగా పేర్కొన్నారు. మరోవైపు జిల్లాలోని ఉట్నూర్, బోథ్, నార్నూర్ ఏరియా ఆసుపత్రులతో పాటు జిల్లాలోని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి. రోగులకు అందుబాటులో ఉండాల్సిన సౌకర్యాలను కల్పించడంలో అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# ప్రైవేట్ టీచర్లకు 'స్పాట్' విధులు

- విధులకు డుమ్మా కొడుతున్న 'సర్కారు' ఉపాధ్యాయులు
- చర్యలకు వెనుకాడుతున్న అధికారులు
- 'పది' ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం

ఆదిలాబాద్‌టౌన్: ఎన్ని విమర్శలు ఎదుర్కొంటున్నా విద్యాశాఖ అధికారుల తీరు మాత్రం మారడం లేదు. విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడుతున్న ఓ ఘటన ఆదిలాబాద్ పదో తరగతి మూల్యాంకన కేంద్రంలో తాజాగా చోటు చేసుకుంది. నిబంధనలను గాలికి వదిలి అధికారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదమవుతోంది. జిల్లా కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్‌లో పదో తరగతి స్పాట్ వాల్యూయేషన్ నిర్వహిస్తున్నారు. ఇందుకు గాను విధులు కేటాయించిన ప్రభుత్వ ఉపాధ్యాయులు వివిధ కారణాలను సాకుగా చూపుతూ, ఉపాధ్యాయ సంఘాల నాయకుల పైరవీలు, అండదండలతో డుమ్మా కొడుతున్నారు. వారిపై కఠినంగా వ్యవహరించాల్సిన ఆ శాఖ అధికారులు చర్యలు చేపట్టకపోగా ప్రైవేట్ టీచర్లు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్ సిబ్బందితో మూల్యాంకనం చేయిస్తుండటం విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

**వారిపై ప్రేమేందుకు**
మూల్యాంకన విధులు కేటాయించిన కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు నిబంధనలకు విరుద్ధంగా స్పాట్‌కు గైర్హాజరవుతున్నారు. అనారోగ్యం పేరిట ఉపాధ్యాయ సంఘాల ద్వారా, వ్యక్తిగత వినతులను సమర్పించారు. అయితే అనారోగ్యం బారిన పడ్డ వారు స్కూల్‌కు మాత్రం వెళ్తుండడం గమనార్హం. ఉదయం నుంచి సాయంత్రం వరకు మూల్యాంకనంలో ఉండాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే ఆ విధులకు ఎగనామం పెడుతున్నట్లుగా తెలుస్తోంది. వీరికి మెమోలు జారీ చేసి కఠినంగా వ్యవహరించాల్సిన విద్యాశాఖాధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అయితే జిల్లా కేంద్రం నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే ఉపాధ్యాయులు మాత్రం వారికి విధులు కేటాయించకపోయినా వారు మాత్రం స్పాట్‌కు వచ్చి విధుల్లో నియమించాలని కోరడం విస్మయానికి గురి చేస్తోంది. గతేడాది స్పాట్‌కు కొంతమంది ఉపాధ్యాయులు హాజరుకాకపోవడంతో రెండు రోజుల పాటు ప్రక్రియ ఆలస్యమైంది.

**ప్రైవేట్ టీచర్లకు విధులు**
నిబంధనల ప్రకారం పదో తరగతి మూల్యాంకన విధులు ప్రభుత్వ, జెడ్పీ యాజమాన్య పరిధిలో పనిచేసే ఉపాధ్యాయులతోనే నిర్వహించాలి. విషయాన్ని ప్రతి రోజు సాయంత్రం 4నుంచి 5 గంటల సమయంలో పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు విద్యాశాఖ అధికారులతో నిర్వహించే జూమ్ మీటింగ్‌లో పదేపదే చెబుతున్నారు. అయితే జిల్లా విద్యాశాఖాధికారులకు మాత్రం ఆ ఆదేశాలు చెవికెక్కడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ స్కూల్స్‌లో పనిచేసే ఉపాధ్యాయులు, గతంలో పని చేసిన విద్యావలంటీర్లు, మోడల్స్ స్కూల్, కేజీబీవీ టీచర్లకు విధులు కేటాయిస్తున్నారు. దాదాపు 20 మందికి పైగా ప్రైవేట్ వారిని విధుల్లోకి తీసుకున్నట్లుగా సమాచారం. ఈ విషయమై డీఈవో ప్రణీతను 'సాక్షి' వివరణ కోరగా మూల్యాంకనానికి స్పెషల్ అసిస్టెంట్లు గైర్హాజరు కావడంతో కేజీబీవీ, మోడల్ స్కూల్, ప్రైవేట్ స్కూల్ టీచర్లకు విధులు అప్పగిస్తున్నట్లుగా తెలిపారు. మూల్యాంకనం ఆలస్యం కావద్దనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా పేర్కొన్నారు. ఇందుకు అన్ని ఉపాధ్యాయ సంఘాలకు సమాచారమిచ్చామని వారు కూడా దీనికి అంగీకరించినట్లుగా చెప్పారు.

# క్రమబద్ధీకరించకుంటే 28 నుంచి సమ్మె

- జూనియర్ పంచాయతీ కార్యదర్శులు స్పష్టం
- కలెక్టర్‌కు సమ్మెనోటీస్ అందజేత



కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న జేపీఎస్‌లు

కైలాస్‌నగర్: ప్రొబేషనరీ గడువు ముగిసినందున తమ సర్వీస్‌ను తక్షణమే క్రమబద్ధీకరించాలని, లేకుంటే ఈ నెల 28నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు (జేపీఎస్‌లు) స్పష్టం చేశారు. తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ రిజ్వాన్‌భాషా షేక్‌లను శనివారం వేర్వేరుగా కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ, ప్రొబెషనరీ గడువు ఈ నెల 11తో ముగిసినా రెగ్యులరైజేషన్‌పై ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు విడుదల చేయడం లేదన్నారు. జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయడంతో పాటు నాలుగేళ్ల ప్రొబెషనరీ కాలాన్ని సర్వీస్‌గా పరిగణించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి పి. ప్రశాంత్, నాయకులు రంజిత్,అరుణ్, అజర్, చైతన్య, గంగన్న, వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

**శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి**
ఆదిలాబాద్‌రూరల్: ఎంసెట్ శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కొలాం బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎంసెట్ శిక్షణ తరగతులను శనివారం ఆయన పరిశీలించారు. మే 8 వరకు నిర్వహించనున్న తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, డీఐఈవో మోసిన్, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

**పకడ్బందీగా రెండో విడత గొర్రెల పంపిణీ**
కైలాస్‌నగర్: రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో రెండో విడత గొర్రెల పంపిణీపై గొల్ల, కుర్మల సహకార సొసైటీల సభ్యులకు శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాలను గొల్ల, కుర్మలు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. జిల్లాలో మొదటి విడతలో 5022 యూనిట్లను పంపిణీ చేశామని తెలిపారు. రెండో విడతలో 3638 యూనిట్ల పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేయాలని పశు సంవర్ధక శాఖ అధికారిని ఆదేశించారు. ఇప్పటి వరకు డీడీలు చెల్లించిన లబ్ధిదారులు ఎవరైనా మరణించినట్లైతే వారి నామినీలకు యూనిట్లను అందజేయాలన్నారు. గొర్రెలను మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లో కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి అధికారులు ఈ కొనుగోలు ప్రక్రియను పరిశీలిస్తారన్నారు. సమావేశంలో పశుసంవర్ధక శాఖ అధికారి కిషన్, ఏడీ రామారావు, సొసైటీల సభ్యులు రఘువీర్, హన్మాండ్లు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



**ఆకట్టుకున్న మాక్‌డ్రిల్**

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆ శాఖ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో శనివారం ప్రదర్శించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అగ్నిప్రమాదాల సమయంలో ఎలా స్పందించాలి, మంటలను ఏ విధంగా అర్పాలనే విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా మాక్ డ్రిల్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కేశవులు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో చాలా భవనాల్లో ఫైర్‌సేఫ్టీ సౌకర్యం లేదన్నారు. ఏదైనా ఘటన జరిగితే యాజమానుల నిర్లక్ష్యానికి అమయకుల ప్రాణాలు పోయే ప్రమాదముందన్నారు. పెద్ద భవంతులు నిర్మించే యజమానులు తప్పని సరిగా ఫైర్ సెఫ్టీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. – ఆదిలాబాద్‌టౌన్

## 'ఓపెన్' పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

కైలాస్‌నగర్: ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 25 నుంచి మే 4 వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పది పరీక్షలు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ఇంటర్ పరీక్షలు కొనసాగుతాయన్నారు. మే 12 నుంచి 19 వరకు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయని తెలిపారు. పది పరీక్షల కోసం జిల్లాలో నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేయగా 987 మంది హాజరుకానున్నట్లు తెలిపారు. అలాగే ఇంటర్ కోసం కేటాయించిన మూడు కేంద్రాల్లో 549 మంది పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలా అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. కేంద్రాల్లోకి సెల్, స్మార్ట్ వాచ్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలలేవి అనుమతించవద్దన్నారు. పరీక్షలు నిర్వహించే సమయంలో సమీప ప్రాంతాల్లోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని, అలాగే కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయాలని పోలీస్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సమావేశంలో విద్యాశాఖ ఏడీ నర్సింలు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ జె.కృష్ణమూర్తి, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ అశోక్, ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన, కలెక్టరేట్ ఏవో అరవింద్ కుమార్, పర్యవేక్షకులు రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్షయ నియంత్రణకు కృషి చేయాలి



సిబ్బందితో సమీక్షిస్తున్న శ్రీకాంత్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాను క్షయ రహితంగా మార్చేందుకు చిత్తశుద్ధితో పని చేయాలని జిల్లా క్షయ నియంత్రణాధికారి శ్రీకాంత్ అన్నారు. రిమ్స్ ఆవరణలోని క్షయ నియంత్రణ కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బందితో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాలో నమోదవుతున్న కేసులు, బాధితులకు అందిస్తున్న వైద్య సేవలు, రోగుల గుర్తింపు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్షయ రోగులను సకాలంలో గుర్తించి వైద్యమందిస్తే వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. బాధితులు పూర్తిస్థాయిలో చికిత్స పొందేలా చూడాలని ఆశ కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో మెడికల్ ఆఫీసర్లు శ్రీజ, సాయిప్రియ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ఆదిలాబాద్‌రూరల్:** మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ గురుకుల విద్యాలయంలో ఇంటర్, డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ గురుకుల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి (ఆర్‌సీవో) కె. గోపీచంద్ ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ కళాశాలలో ప్రవేశాల గడువు ఆదివారంతో ముగియనుందని, ఇంకా ఎవరైనా విద్యార్థులు దరఖాస్తు చేసుకునే వారు ఉంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ (ఆర్‌జెసి), రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ (ఆర్‌డీసీ)లకు మే 30న ప్రవేశ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రాల్లో పరీక్ష కేంద్రాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాలని సూచించారు.

### గుండెనొప్పితో మహిళ మృతి

**జైపూర్:** గుండెపోటుతో మహిళ మృతిచెందిన సంఘటన మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... చెన్న పోసమ్మ (38) నస్పూర్‌లోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సత్యాగ్రహ బహిరంగ సభకు వెళ్లింది. తిరిగి రాత్రి బస్సులో ఇంటికి చేరుకుంది. ఛాతిలో నొప్పి వస్తుందని కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో మంచిర్యాల ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలికి భర్త రాజయ్య, కొడుకు శేఖర్, కూతురు లక్ష్మి ఉన్నారు.

### డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు

**కడెం:** మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ముగ్గురు వ్యక్తులకు జైలు శిక్ష పడింది. ఆయా గ్రామాలకు చెందిన కాంబ్లే బాలాజీ, రాజేశ్వర్, రఘులను శనివారం ఖానాపూర్ ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ జితిన్‌కుమార్ ఎదుట హాజరు పరుచారు. వారికి ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై రాజు తెలిపారు.

### నేడు 'సేంద్రియం'పై ప్రత్యేక కార్యక్రమం

**ఎదులాపురం:** ఆదిలాబాద్ 100.2 ఎంఎఫ్‌లో ఆదివారం రాత్రి 7.15 గంటలకు ప్రసారమయ్యే ఇల్లు ఎవుసం కార్యక్రమంలో ''సేంద్రియ వ్యవసాయం– అవగాహన'' కార్యక్రమం ప్రసారం చేస్తున్నట్లు ప్రోగ్రాం హెడ్ రామేశ్వర్ కేంద్రే ఒక ప్రకటనలో తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం విషయ నిపుణులు ఎం.రఘువీర్‌తో ముచ్చట కార్యక్రమం ఉంటుందని, శ్రోతలు సద్వినియోగించుకుని సేంద్రియ వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని కోరారు.

### ఆటో డ్రైవర్‌పై కేసు



ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న ఎస్సై

**కుంటాల:** మండలంలోని ఓల, లింబా(కే) గ్రామాల మధ్య శనివారం ఎస్సై హన్మండ్లు ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేపట్టారు. లింబా(కే) నుంచి కుంటాల వెళ్తున్న ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడంతో ఆటో డ్రైవర్ శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



# అడ్డొస్తే.. దాడులే






అటవీశాఖ వాహనాన్ని కల్వర్టులోకి తోసేసిన స్మగ్లర్లు (ఫైల్)

- మితిమీరుతున్న కలప స్మగ్లర్ల ఆగడాలు
- అటవీశాఖ సిబ్బందిపై దాడులు
- వారంలో రూ.8లక్షల కలప పట్టివేత
- 12మంది కేసులు నమోదు
- స్మగ్లర్లంతా నేర ప్రవృత్తి కలిగిన వారే..

**ఇచ్చోడ:** ఆదిలాబాద్ జిల్లాలో కలప స్మగ్లర్ల ఆగడాలు మితిమీరుతున్నాయి. అడ్డొచ్చిన వారిపై దాడులకు దిగుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. కలప రవాణే జీవనాధారంగా మార్చుకున్న స్మగ్లర్లు అడ్డొచ్చిన అటవీశాఖ అధికారుల అడ్డుతొలగించుకోవడానికి ఎంతకైనా తెగిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం సీఎం కేసీఆర్ అక్రమ కలప రవాణా నియంత్రణపై సీరియస్‌గా దృష్టి సారించాలని, అడవుల రక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో జిల్లాలో కలప స్మగ్లింగ్‌కు బ్రేక్ పడింది. కానీ గత ఐదారు నెలల నుంచి కలప దందా గుట్టుచప్పుడు కాకుండా జోరుగా సాగుతోంది.

### అడ్డొచ్చిన వారిపై దాడులు...

అక్రమంగా కలప దందా చేసే స్మగ్లర్లంతా నేరప్రవృత్తి కలిగిన వారే. స్మగ్లింగ్‌కు అడ్డొచ్చిన సిబ్బందిపై దాడులు చేయడం వారికి కొత్తేమి కాదు. గతంలో అటవీశాఖ సిబ్బందిపై దాడులు చేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి. గత కొన్నేళ్ల నుంచి ఆదిలాబాద్ జిల్లాల్లో ఇచ్చోడ కేంద్రంగా సాగుతున్న కలప దందాకు పాల్పడిన స్మగ్లర్లపై ఇచ్చోడ, గుడిహత్నూర్, నేరడిగొండ, బోథ్, ఆదిలాబాద్ పోలీస్‌స్టేషన్లలో 2వేల మందిపై కేసులు నమోదయ్యాయి.

### పట్టుబడుతున్న కలప

వారం రోజుల వ్యవధిలో అక్రమంగా తరలిస్తున్న రూ.8లక్షల కలపను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ఈ నెల 7న నేరడిగొండ మండలంలోని నాగమల్యాల్‌లో తనిఖీలు నిర్వహించగా రూ.50వేల కలపను స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 8న ఇంద్రవెల్లి మండలం నుంచి అక్రమంగా తరలిస్తున్న రూ.5లక్షల విలువ చేసే కలప పట్టుబడింది. అలాగే ఈ నెల 13న గుడిహత్నూర్ మండలంలో రూ. 2.50 లక్షల కలపను అటవీ అధికారులు పట్టుకున్నారు.

### 12 మందిపై కేసు.

ఇటీవల కాలంలో కలప స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న 12మంది పై కేసులు నమెదు చేశారు. మరో నలుగురు పరారీలో ఉన్నారు. కేసులు నమోదైన 12మంది సైతం ఒకే వర్గానికి చెందిన కలప స్మగ్లర్లు కావడం గమనార్హం.

### పీడీ యాక్ట్ నమోదు చేస్తాం



కలప స్మగ్లింగ్‌కు పాల్పడిన వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తాం. కలప స్మగ్లింగ్‌ను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అక్రమంగా ఎవరైనా కలప తరలిస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేయాలి.

– బార్నోబా, ఎఫ్‌డీవో, ఇచ్చోడ

**అటవీ సిబ్బందిపై జరిగిన దాడులు..**

- ఈ నెల 9న ఇంద్రవెల్లి మండలం నుంచి ఐచర్ వాహనంలో కలప తరలిస్తున్నట్లు సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు గుడిహత్నూర్ ఎక్స్‌రోడ్డు వద్ద వాహనం పట్టుకునే ప్రయత్నం చేశారు. ఐచర్ వ్యాన్‌తో అటవీశాఖ సిబ్బందిని ఢీకొట్టి ప్రయత్నం చేశారు. ఈ సంఘటలో సిబ్బంది ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.
- ఐదు రోజుల క్రితం టైగర్‌జోన్ నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను అటవీశాఖ అధికారులు పట్టుకుంటే ఎఫ్‌ఆర్వోపై దాడికి పాలద్దారు. ఈ దాడిలో ఎఫ్‌ఆర్వోకు గాయాలయ్యాయి.
- ఆరు నెలల క్రితం అక్రమంగా కలప తరలిస్తున్న ఆటోను పట్టుకోగా స్మగ్లర్లు సిబ్బందిపై దాడిచేసి పారిపోయారు. ఈ సంఘటనలో సిబ్బందిలోని ఒకరిది చేతి విరిగింది.

# స్థలం కేటాయిస్తే ఆస్పత్రి నిర్మిస్తాం



ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ రమేశ్

**ఇచ్చోడ:** ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తే ఇచ్చోడలో 30 పడకల ఆస్పత్రిని నిర్మించడానికి వైద్యా ఆరోగ్య శాఖ సిద్ధంగా ఉందని ఆ శాఖ జాయింట్ కమిషనర్ డాక్టర్ రమేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. ఏటా ఆరోగ్య కేంద్రం వర్షాకాలంలో నీట మునిగిపోతోందని, దీంతో రోగులు, సిబ్బంది సైతం ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. మూడెకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆరోగ్య శాఖకు కేటాయిస్తే ఇచ్చోడలో 30 పడకల ఆస్పత్రి నిర్మించడానికి వైద్యాఆరోగ్య శాఖ సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ లోక శిరీష్‌రెడ్డి, అడిషనల్ డీఎంహెచ్‌వో సాధన, వైద్యాధికారి సాగర్ ఉన్నారు.

# 'భారత దర్శన్'తో సంస్కృతి ఏకీకరణ

- బీజేపీ మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జి మురళీధర్‌రావు



మాట్లాడుతున్న మురళీధర్‌రావు

**ఆదిలాబాద్:** భారత్ దర్శన్ యాత్ర భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని బీజేపీ జాతీయనేత, పార్టీ మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జి మురళీధర్‌రావు అన్నారు. భారతీయ సంస్కృతి ఏకీకరణకు ఈ యాత్ర కీలకం కానుందన్నారు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌లో భాగంగా హైదరాబాద్ నుంచి ప్రారంభమైన యాత్రం శనివారం మధ్యాహ్నం జిల్లా కేంద్రానికి చేరుకుంది. పార్టీ ఆధ్వర్యంలో వారికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మురళీధర్ రావు మాట్లాడారు. భారత దేశం భిన్న సంస్కృతి, సంప్రదాయాలకు నెలవన్నారు. ప్రతీ సంస్కృతి తనదైన ప్రత్యేకత చాటుతోందని, ఈ విషయాన్ని ప్రజలందరికీ తెలియజేయాలనే ఉద్దేశంతోనే భారత్ దర్శన్ యాత్రకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇందులో మేధావులు, శాస్త్రవేత్తలు, సామాజిక కార్యకర్తలు సుమారు 400 మంది పాల్గొంటున్నారని చెప్పారు. భాగ్యనగర్ నుంచి ప్రారంభమైన యాత్ర మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని వరకు కొనసాగుతుందన్నారు. ఏప్రిల్ 21న యాత్ర ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి, ఆదినాథ్, దినేష్ మటోలియా, లోక ప్రవీణ్‌రెడ్డి, చిలుకూరి జ్యోతిరెడ్డి, ధోని జ్యోతి, కృష్ణ యాదవ్, రత్నాకర్‌రెడ్డి, మయూర్ చంద్ర, ముకుంద్, రవి తదితరులు పాల్గొన్నారు.

### యువకుడి ఆత్మహత్య

**ఆదిలాబాద్‌టౌన్:** ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన గౌరు సాయికిరణ్(23) ఆత్మహత్య చేసుకున్నాడు. టూ టౌన్ ఎస్సై విష్ణు ప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన గౌరు విజయలక్ష్మి కుమారుడు సాయి కిరణ్ కొన్నేళ్లుగా తాగుడుకు బానిసయ్యాడు. తల్లిని వేధించడంతో ఆమె పిప్పల్‌కోఠి గ్రామంలో నివసిస్తోంది. ఇంట్లోని వస్తువులన్నింటినీ అమ్ముకుంటూ మద్యం సేవిస్తున్నాడు. మద్యానికి డబ్బులు లేకపోవడంతో గత రెండు, మూడు రోజుల క్రితం ఇంట్లో ఉరేసుకున్నాడు. ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో కిటికీలో నుంచి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కన్పించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**ప్రాజెక్టులో దూకి వృద్ధుడు..**
**పెంచికల్‌పేట్:** అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడు ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఎల్లూర్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఇన్‌చార్జి ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుర్గం నానయ్య (80) రెండు సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రులకు వెళ్లినా ఆరోగ్యం కుదుటపడకపోవడంతో మానసికంగా తీవ్రంగా కుంగిపోయి గ్రామ సమీపంలోని బొక్కివాగు ప్రాజెక్టులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు పోశన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

**బావిలో దూకి మరొకరు..**
**లక్సెట్టిపేట:** బావిలో దూకి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలోని గాంధీనగర్‌లో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం... రాచర్ల అజయ్ (40) వయస్సు దాటిపోయినా ఇంకా పెళ్లి కాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. రెండు రోజులుగా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసినా వారి వద్ద ఆరా తీసిన ఫలితం కానరాలేదు. శనివారం అంకతివాడ సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో అజయ్ మృతదేహం కనిపించింది. తండ్రి చిలుకయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## మురళీధర్‌రావుకు సన్మానం



మురళీధర్‌రావును సన్మానిస్తున్న జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, నాయకులు

**సోన్:** బీజేపి జాతీయ నాయకులు మధ్యప్రదేశ్ రాష్ట్ర బీజేపి ఇన్‌చార్జి మురళీధర్ రావును జిల్లా బీజేపి నాయకులు సన్మానించారు .భారత్ దర్శన్ యాత్రలో భాగంగా శనివారం ఉజ్జయిని మహంకాళీ వెళ్తున్న మురళీధర్‌రావు సోన్ మండలంలోని కడ్తాల్ వద్ద జిల్లా బీజేపీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలతో సన్మానించారు. ఇందులో బీజేపి జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి, నాయకులు పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్న భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు మెడిసెమ్మె రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ భుక్య జానుబాయి, బీజేపీ జిల్లా దళిత మోర్చా అధ్యక్షుడు సాగర్, నాయకులు నర్సాగౌడ్, అంజుకుమార్ రెడ్డి, కమల్ నయన్, రాజేందర్, ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

### కలప పట్టివేత

**బోథ్:** మండలంలోని చింతల్‌బోరి గ్రామంలో రూ.10వేలు విలువ చేసే కలపను శనివారం అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. డీఆర్‌వో ప్రమోద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాంబ్లె మాదవ్ ఇంటి వద్ద అక్రమంగా కలప నిల్వ ఉంచినట్లు సమాచారం రావడంతో అటవీశాఖ సిబ్బంది వెళ్లి పట్టుకున్నారు. అనంతరం మాదవ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

### దాడి చేసిన ఒకరిపై కేసు

**ఆదిలాబాద్‌టౌన్:** దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించగా మహిళలు నృత్యాలు చేశారు. ఈ సమయంలో సుందరయ్యనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ సజ్జద్ వారి మధ్యలోకి వెళ్లి డ్యాన్స్ చేశాడు. దీంతో ఖుర్షీద్ నగర్‌కు చెందిన కాంబ్లే రోహిత్ మహిళల మధ్యలో డ్యాన్స్ చేయవద్దని సూచించడంతో బయటకు వచ్చాడు. సాయంత్రం రోహిత్ ఇంటికి వెళ్తున్న సమయంలో మమత జిన్నింగ్ వద్ద ఆయనపై సజ్జద్ దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ఫ్లెక్సీ వివాదంలో ఇరువర్గాలపై కేసు



వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై విక్రమ్



కోలూరు గ్రామానికి చేరుకున్న ఆర్డీవో, తహసీల్దార్

**తానూరు:** అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఇరువర్గాల మధ్య గొడవకు దారి తీసింది. ఈ సంఘటన మండలంలోని కోలూరు గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం.. కోలూరు బస్టాండ్ ప్రాంతంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా ఓ వర్గానికి చెందిన కొంతమంది ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో మరో వర్గానికి కొందరు నాయకులు దాని పక్కనే మరో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దానిపై అంబేద్కర్ చిత్రపటంతో పాటు రాజకీయ నాయకుల ఫొటోలు ఉండడంతో గ్రామంలోని కొందరు యువకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఎస్సై విక్రమ్ చేరుకుని ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. శనివారం ఉదయం సీఐ వినోద్ గ్రామాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. గొడవకు పాల్పడిన ఇరువర్గాలకు చెందిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. భైంసా ఆర్డీవో రవి, తహసీల్దార్ వెంకటరమణ, ఆర్ఐ గంగాధర్ గ్రామానికి సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

**నలుగురిపై కేసు నమోదు**
**ఆదిలాబాద్‌టౌన్:** అంబేద్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం రాత్రి నిర్వహించిన ర్యాలీలో ఇరు వర్గాల యువకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఓ వర్గానికి చెందిన యువకుడు కాషాయజెండాతో ర్యాలీలో పాల్గొనగా మరో వర్గానికి చెందిన కొంతమంది యువకులు ఆ యువకుడిపై దాడికి పాల్పడ్డారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర ఘర్షణ నెలకొనగా ఉదయం బీజేపీ నాయకులతో పాటు బాధిత యువకులు వన్‌టౌన్ ఎదుట ఆందోళన చేపట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురు యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

# కఠిన చర్యలు తీసుకోవాలి

- హిందువులపై దాడి సరికాదు
- హిందూ సంఘాల డిమాండ్
- జిల్లా కేంద్రంలో రాస్తారోకో



ఆందోళనకారులతో మాట్లాడుతున్న డీఎస్పీ ఉమేందర్



ఆందోళనకారులను అరెస్టు చేస్తున్న పోలీసులు

**ఆదిలాబాద్:** హిందువులపై దాడి చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రి ఎదుట శనివారం రాస్తారోకో నిర్వహించారు. నిందితులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ హోరెత్తించారు. నాయకులు, యువత పెద్ద ఎత్తున తరలి రావడంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా హిందూ సంఘం నాయకుడు రాళ్ల బండి మహేందర్ మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి ఉత్సవ ర్యాలీలో భాగంగా కాషాయపు జెండాను ప్రదర్శించిన యువకులపై పలువురు యువకులు దాడి చేశారని మండిపడ్డారు. వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసులు చేరుకుని వారిని అరెస్ట్ చేయడానికి ప్రయత్నించగా తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అరెస్ట్ చేసిన వారిని వ్యాన్‌లో తరలించడానికి పోలీసులు ప్రయత్నించగా వ్యాన్‌కు అడ్డంగా కూర్చొని యువకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం డీఎస్పీ ఉమేందర్ ఆందోళనకారులను సముదాయించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే ముగ్గురిని రిమాండ్‌కు తరలించడం జరిగిందని వెల్లడించారు. అనంతరం శాంతించిన నిరసనకారులు టూ టౌన్ పోలీస్ స్టేషన్ వద్దకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా టూ టౌన్ లో డీఎస్పీ మీడియాతో మాట్లాడుతూ తైవార్, షాహిద్, అబ్బు అనే నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మిగతా వారిని సైతం వీలైనంత త్వరగా అరెస్టు చేస్తామని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని సుహాసిని రెడ్డి, లాలా మున్నా, రఘుపతి, రాకేష్, మహేందర్ పాల్గొన్నారు.

**30 మందిపై కేసు నమోదు**
**ఆదిలాబాద్‌టౌన్:** శాంతిభద్రతలకు విఘాతం కలిగించడంతో పాటు ప్రయాణిలకు ఇబ్బందులకు గురిచేశారని టూ టౌన్ పోలీసులు 30 మందిపై శనివారం కేసు నమోదు చేశారు. రిమ్స్ ఆసుపత్రి ఎదుట శుక్రవారం జరిగిన ఘటనకు నిరసనగా ఆందోళన చేపట్టగా పోలీసులు వారికి నచ్చజెప్పిన వినకపోవడంతో వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణు ప్రకాష్ తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి



రాధేశ్యాం మృతదేహం

**గుడిహత్నూర్:** మండలంలోని డోంగర్‌గావ్ వద్ద జాతీయ రహదారి 44పై శనివారం రాత్రి 8:30 గంటల ప్రాంతంలో జరిగిన కంటెయినర్ ట్రాలీ ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన డ్రైవర్ మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. హైదరాబాద్ వైపు నుంచి నాగ్‌పూర్ వైపు వెళ్తున్న కంటెయినర్ ట్రాలీ వాహనాన్ని అజాగ్రత్తగా నడుపుతూ వస్తున్న డ్రైవర్ రాధేశ్యాం(42) మండలంలోని డోంగర్‌గావ్ వద్దకు చేరుకోగానే అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీ కొట్టాడు. దీంతో రాధేశ్యాం ఎగిరి పడగా.. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని హైవే అంబులెన్సులో రిమ్స్ తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్.ప్రవీణ్‌కుమార్ తెలిపారు.